క్లుప్తంగా

ఆర్‌బీకే సేవలు సద్వినియోగం చేసుకోండి



గోనెగండ్ల ఆర్‌బీకేలో కియోస్క్ మిషన్‌లో ఎరువుల స్టాకును పరిశీలిస్తున్న అధికారులు

గోనెగండ్ల: ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ సీడ్‌ఫార్మ్ శైలకుమారి, ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ సూచించారు. శుక్రవారం ఏఓలు షర్మిల, హేమలతతో కలిసి గోనెగండ్లలోని నాలుగు ఆర్బీకేలను తనిఖీ చేశారు. రికార్డులు, ఎరువుల అమ్మకాలు, సీఎంఏఐడీ, డీబీటీ, ఎరువుల స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్‌బీకేల్లో రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే రైతులు ఫిబ్రవరి 15లోపు పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆర్‌బీకే సిబ్బంది ఉన్నారు.

చంద్రబాబు సభకు స్థల పరిశీలన

పత్తికొండ రూరల్: పత్తికొండలో ఈ నెల 25న జరగబోయే చంద్రబాబు పర్యటనను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ప్రోగాం కో–ఆర్డినేటర్ వైకుంఠం ప్రభాకర్‌చౌదరి పిలుపునిచ్చారు. శుక్రవా రం స్థానిక టీడీపీ కార్యాలయంలో జిల్లా ముఖ్యనేతలు, మండలాల నాయకులు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పత్తికొండ–ఆదోని రోడ్డులోని పెట్రోలుబంకు సమీపంలో బహిరంగ సభ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, టీజీ భరత్, కేఈ శ్యాంబాబు, సుజాతమ్మ, మీనాక్షినాయుడు, తిక్కారెడ్డి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సవాసప్ప తాత ఉరుసు

తుగ్గలి: మండల పరిధిలోని చెన్నంపల్లిలో వెలసిన సవాసప్ప తాత ఉరుసు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని కోట వద్ద ఉన్న దర్గాను పూలతో అలంకరించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత గంధం ఊరేగింపుతో దర్గా వద్దకు వెళ్లి ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గ్రామాల అభివృద్ధికి పాటు పడాలి

కృష్ణగిరి: ఆర్థిక సంఘ నిధులు వినియోగించుకుని గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని ఈఓఆర్డీ మురళీమోహన్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి ఏర్పాటు చేసిన రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభయాన్ శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచాయతీల అభివృద్ధి కోసం ఆర్థిక సంఘం నిధులు కేటాయిస్తుందని, గ్రామ కార్యదర్శులు స్థానిక ప్రజా ప్రతినిధులతో సంప్రదించి ప్రజలకు అవసరమయ్యే పనులు చేపట్టాలని తద్వారా గ్రామాలను అభివృద్ధిలోకి తీసుకరావాలన్నారు. ట్రైనర్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

'వైఎస్సార్‌సీపీ గెలుపును అడ్డుకోలేరు'

నందవరం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధిని చూసి ఏ కార్యకర్త కూడా పార్టీని వీడే ప్రసక్తే లేదని ఎంపీటీసీ దావీదు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరత్ బిలాల్, శ్రీనివాసులు, గట్టు జయన్న, తిమ్మప్ప పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని హాలహర్వి గ్రామంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. హాలహర్వి నుంచి కొందరు టీడీపీలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు ప్రకటించడం సిగ్గుచేట్లాన్నారు. టీడీపీ వారే ఆ పార్టీ కండువా కప్పుకుని ప్రచారం చేయడం విడ్డూరమన్నారు. ప్రజల్లో వైఎస్సార్‌సీపీ మద్దతును చూసి ఓర్వలేకనే ఉదంతులు సృష్టిస్తున్నారని ఆరోపించారు.

వ్యవసాయ కార్మిక సంఘం ఎన్నిక

వెల్దుర్తి(కృష్ణగిరి): ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నబిరసూల్, సీపీఐ మండల కార్యదర్శి టి కృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వారి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో సంఘం మండలాధ్యక్షుడిగా అల్లుగుండు చిలిపి కృష్ణ, కార్యదర్శిగా బోయనపల్లె వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా నరసాపురం దస్తగిరి, చిన్నమాదులు, రాముడు, మరి కొందరు ప్రతినిధులుగా రాజు, సీమోను, శ్రీను, ఏసు, కృష్ణ, ఆంజనేయులు ఎన్నికయ్యారు.

ముగిసిన మండలస్థాయి క్రీడలు

కృష్ణగిరి: ఆరు రోజులుగా హోరాహోరీగా జరిగిన ఆడుదాం–ఆంధ్రా మండలస్థాయి క్రీడాపోటీలు శుక్రవారంతో ముగిశాయి. మండలంలోని 14 సచివాలయాల పరిధిలోని క్రీడాకారులకు వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు కంబాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మైదానంలో నిర్వహించారు. ఖోఖో, బ్యాడ్మింటన్‌లో అమకతాడు జట్లు, వాలీబాల్‌లో ఎస్‌హెచ్ ఎర్రగుడి జట్టు, క్రికెట్‌లో కోయిలకొండ, కబడ్డీలో కంబాలపాడు జట్టు నియోజకవర్గ స్థాయికి ఎంపికైనట్లు ఎంపీడీఓ రామస్వామి తెలిపారు. ఈ నెల 24 నుంచి పత్తికొండ జరిగే పోటీల్లో వీరందరూ పాల్గొంటారని చెప్పారు.

సురక్ష.. పేదల ఆరోగ్యానికి రక్ష



మద్దికెరలో ఆరోగ్య సూచనలు చేస్తున్న వైద్యసిబ్బంది



గోనెగండ్ల వైద్య శిబిరంలో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా మలేరియా అధికారి నూకరాజు

గోనెగండ్ల: పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మలేరియా అధికారి నూకరాజు అన్నారు. శుక్రవారం గోనెగండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఈఓఆర్డీ నాగేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. వైద్య శిబిరంలో డాక్టర్లు రవళి, విజయబాబు, రంగస్వామి, దివ్యలు 340 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఏఓ బాబుభాస్కర్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి సాయిబాబా, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ రవి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమంలో భాగంగా మండలంలోని మరకట్టు గ్రామంలో రోగులకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దగ్గు, జలుబు, జ్వరం, దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడిన ప్రతి రోగికి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. శుక్రవారం మరకట్టు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 176 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్లు చంద్రకళ, అంద్రూస్, బాషా ఫార్మసిస్ట్ వెంకటరమణ, వైద్య సిబ్బంది ఉన్నారు.

తుగ్గలి: పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎంపీటీసీ సభ్యురాలు ఆవుల ఆదిలక్ష్మి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమంలో భాగంగా కడమకుంట్లలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. సచివాలయ పరిధిలోని గ్రామాల నుంచి వచ్చిన వారికి వైద్యులు మినాజ్‌పాషా, శిరీష, ఆప్తాలిక్ అసిస్టెంట్ హనుమంతరెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజినేయులు, రమేష్, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ గోపాల్, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణగిరి: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఏ ఇంట్లో అనారోగ్య బాధితులు ఉన్నారో గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు సర్పంచ్ బోయ సర్వేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొని వైద్య శిబిరాన్ని పారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్య సర్వే నిర్వహించి ప్రణాళికాబద్ధంగా కార్యక్రమం నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలోని 351 మందికి స్పెషలిస్ట్ డాక్టర్లచే వైద్య సేవలందించినట్లు వైద్యాధికారి ప్రదీప్ తెలిపారు. ఎంపీహెచ్‌ఓ గజేంద్రారెడ్డి, నాయకులు బాలమిన్నెల్ల తదితరులు పాల్గొన్నారు.

చిప్పగిరి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష – 2 కార్యక్రమానికి మండలంలోని బెల్డోణ గ్రామంలో విశేష స్పందన లభించింది. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు ఓపీ ద్వారా 454 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ కొండయ్య, మెడికల్ ఆఫీసర్ షేక్ అఫ్రోజ్ జహాన్, స్పెషలిస్టు డాక్టర్లు వెంకటేష్, జయలక్ష్మి, సంపత్‌కుమార్, ఈఓపీఆర్డీ బాలన్న తదితరులు పాల్గొన్నారు.

నందవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదల ఆరోగ్యానికి రక్షగా నిలిచిందని ఎంపీడీఓ దశరథ రామయ్య, డాక్టర్ రేవతి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కనకవీడు పేట గ్రామంలో రెండవ విడత 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ సరస్వతి చేతుల మీదుగా ప్రారంభించారు. శిబిరంలో 215 మందికి వైద్య పరీక్షలు చేసి చికిత్స అందించారు. స్పెషలిస్టు డాక్టర్లు మహమ్మద్ సర్ఫరాజ్, రాహుల్, సీహెచ్‌ఓ బలరాం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హాలహర్వి: మండలంలోని గూళ్యం–1 సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు తిమ్మయ్య, మన్సూర్‌వలీ, కిరణ్, గైనకాలజిస్ట్ ముబసీన్‌బాను పాల్గొని రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని రామళ్లకోట గ్రామంలో సర్పంచ్ నిర్మల, పీహెచ్‌సీ వైద్యాధికారి భువనతేజ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం 2.0 విజయవంతమైంది. స్పెషలిస్టు వైద్యులు రాధిక, ప్రశాంతి, కవిత ప్రతిభ తదితరులు శిబిరానికి వచ్చిన 280 మంది వైద్య పరీక్షలుచేసి మందులు పంపిణీ చేశారు. ఆరుగురిని మెరుగైన చికిత్స కోసం రెఫర్ చేశారు. ఎంపీడీఓ శ్రీనివాసరావ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు మాధవస్వామి వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు.

మద్దికెర: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని ప్రభుత్వ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణి అన్నారు. శుక్రవారం మద్దికెర సచివాలయం–3 లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

మాలాంటి వారికి ఎంతో మేలు

నేను కొన్నాళ్లుగా కంటి సమస్యతో సతమతమవుతున్నా. సురక్ష వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్నా. ఉచితంగా మందులు, కంటి అద్దాలు ఇచ్చారు. గతంలో ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించే వారు కాదు. నానా తిప్పలు పడి 15 కి.మీ దూరంలో ఉన్న ప్యాపిలికి వెళ్లే వాళ్లం. ఇప్పుడు సీఎం జగన్ ఊళ్లలోనే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం వల్ల మాలాంటి వాళ్లకు ఎంతో మేలు జరుగుతోంది.

– లింగమ్మ, కడమకుంట్ల



బెల్డోణలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



గూళ్యంలో ఓపీ ఇస్తున్న వైద్యసిబ్బంది



రామళ్లకోటలో వైద్య సేవల పరిశీలనలో ఎంపీడీఓ, సర్పంచ్ తదితరులు



మరకట్టులో ఈసీజీ పరీక్షలు చేస్తున్న దృశ్యం



కడమకుంట్లలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు ఆదిలక్ష్మి



అమకతాడులో రోగులకు మందులు అందిస్తున్న దృశ్యం



కనకవీడుపేటలో రోగులకు మందులను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



బోయనపల్లెలో వేరుశనగ పంట కోత ప్రయోగం చేపట్టిన అధికారులు

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రకృతి వ్యవసాయంతో ఖర్చులు తగ్గడమే గాకుండా, భూమి సారవంతమవుతూ అధిక దిగుబడులు వస్తున్నాయని ప్రయోగాత్మకంగా నిరూపితమైనట్లు ప్రకృతి వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ అధికారి షేక్ మాబువలి అన్నారు. ఆయన శుక్రవారం మండల పరిధిలోని బోయనపల్లె గ్రామంలో వీహెచ్‌ఏ పుల్లయ్య, రైతుల సమక్షంలో ప్రకృతి వ్యవసాయం, రసాయనాల వినియోగంతో సాగుచేసిన పొలాల్లో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. విత్తన దశ నుంచి కోత వరకు ఆవు పేడ, పంచకం, ఘన, ద్రవ జీవామృతం, బ్రహ్మాస్త్రం తదితర పద్ధతుల్లో సాగుచేసిన రైతు తలారి బోయ పెద్ద శ్రీనివాసులుకు చెందిన వేరుశనగ పొలంలో పంట కోత ప్రయోగం నిర్వహించగా ఎకరానికి 16.5 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని అంచనా వేశారు. అదే గ్రామంలో రసాయనిక వ్యవసాయం చేసిన మరో రైతుకు చెందిన వేరుశనగ పొలంలో పంటకోత ప్రయోగం చేపట్టగా ఎకరానికి 11.5 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ప్రకృతి వ్యవసాయంలో నాణ్యమైన అధిక దిగుబడులు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జనార్దన్, చిట్టెమ్మ, రామచంద్రుడు, బాల కృష్ణ, వలి, రామకృష్ణారెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

జగనన్నతోనే సామాజిక న్యాయం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హొళగుంద: రాష్ట్రంలో సామాజిక పాలన అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. విజయవాడలో శుక్రవారం 206 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణను పురస్కరించుకుని హొళగుందలో అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఈశా, కోగిలతోట శేషప్ప, మల్లికార్జున, కెంచప్ప, హనుమప్ప, శివన్న తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించారని గుర్తుచేశారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

ఆలూరు: స్థానిక ప్రభుత్వ బాలుర 1–2 హైస్కూళ్లలో నవోదయ ప్రవేశ పరీక్షలను శనివారం నిర్వహించనున్నట్లు ఎంఈఓ కోమలాదేవి శుక్రవారం తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష కోసం 25 రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. 35 మంది సిబ్బంది నియమించినట్లు ఎంఈఓ తెలిపారు. ఉదయం 11:30 నుంచి 1:30 వరకు పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

రామ మందిర నిర్మాణం చరిత్రాత్మకం

మద్దికెర: అయోధ్యలో శ్రీరాముడి మందిరం నిర్మించి బాలరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించడాన్ని దేశంలోని ప్రతి హిందువూ గర్వించాలని శ్రీరంగనాథ దేవాలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, పారా విశ్వనాథ్, రామచంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో శ్రీరంగనాథస్వామి దేవాలయంలో ఈనెల 22వ తేదీ శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించి విగ్రహాలను గ్రామంలో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. అలాగే అయోధ్య అక్షింతలు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఈ–కేవైసీ తప్పనిసరి

మద్దికెర: రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు ఫిబ్రవరి 15 లోగా ఈ–కేవైసీ చేయించాలని ఏఓ రవి శుక్రవారం తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఈ–కేవైసీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పంటలకు సంబంధించిన వివరాలు తెలియజేయకపోతే ప్రభుత్వం అందించే సబ్సిడీలు, పంట నష్ట పరిహారం పథకాలు వర్తించవన్నారు. వీఏఏలు జాకీర్, ఆనంద్ ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ డివిజన్ ఉపాధ్యక్షుడిగా వెంకటేష్

హొళగుంద: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) పత్తికొండ డివిజన్ ఉపాధ్యక్షుడిగా హొళగుంద మండలానికి చెందిన పంచగుండిగ వెంకటేష్ ఎన్నికయ్యారు. శుక్రవారం ఆలూరులో ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు చిప్పగిరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పత్తికొండ డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీలో హొళగుంద మండలం నుంచి తనను ఎంపిక చేసి ఉపాధ్యక్ష పదవి కట్టబెట్టినట్లు వెంకటేష్ తెలిపారు. దళితుల సంక్షేమం కోసం పాటు పడ్తానని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన గొల్ల నరసింహారెడ్డి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలోని మలుపు వద్ద శుక్రవారం రాత్రి ఎదురుగా వస్తున్న లారీని బైక్ ఢీకొనడంతో గొల్ల నరసింహారెడ్డి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. నందవరం మండలం ముగతికి చెందిన గొల్ల నరసింహారెడ్డి, భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలతో కర్నూలు బళ్లారి చౌరస్తాలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. నరసింహారెడ్డి డీ–మార్ట్‌లో పనిచేస్తుండగా భార్య జ్యోతి వేరే చోట పనిచేస్తుంది. సంక్రాంతి సెలవులు కావటంతో భార్య, పిల్లలతో తన పుట్టినిల్లు తెలంగాణలోని ఐజ మండలం బింగిదొడ్డి గ్రామానికి వెళ్లింది. సెలవులు ముగుస్తుండడంతో నరసింహారెడ్డి భార్య ఊరికి వెళ్లి వారిని బైక్‌పై తీసుకొచ్చి తన స్వగ్రామం ముగతిలోని తల్లిదండ్రుల వద్ద వదిలారు. అక్కడి నుంచి నరసింహారెడ్డి కర్నూలుకు బైక్‌పై బయలుదేరాడు. ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలోని మలుపు వద్ద ఆదోని వైపు వస్తున్న డీసీఎం లారీని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. తలకు బలమైన గాయం కావడంతో చెవులు, ముక్కు నుంచి రక్తస్రావం అయ్యింది. కుడిచెయ్యి విరిగిపోయింది. గాయపడ్డ వ్యక్తిని 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి అక్కడినుంచి కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ ఏఎస్ఐ బాలనాయక్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలోని అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలో గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాఘవేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మరమ్మతు పనుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వ్యవసాయ విద్యుత్ ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు. అలాగే గోవర్ధనగిరి, చెర్లకొత్తూరు పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందన్నారు. ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

గోనెగండ్ల: మండల వ్యాప్తంగా శనివారం వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సుధాకర్‌రావు శుక్రవారం తెలిపారు.

ఆలూరు రూరల్: మండలంలో శనివారం ఫేజ్–3 విద్యుత్ సరఫరాలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అంతరాయం ఉంటుందని ఆలూరు విద్యుత్ డిప్యూటీ ఈఈ నాగేంద్ర తెలిపారు. మరమ్మతు పనుల నేపథ్యంలో ఫేజ్–1 సప్లై మాత్రమే ఉంటుదన్నారు.

పత్తికొండ టౌన్: కర్నూలు 220 కేవీ విద్యుత్తు మెయిన్ లైన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ఖాజావలి తెలిపారు.

మద్దికెర: 220 కేవీ ఎస్ఎస్ కార్బైడ్స్ కర్నూలు నందు నిర్వహణ పనుల దృష్ట్యా శనివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని ఏఈ రఫిక్ అహమ్మద్ శుక్రవారం తెలిపారు.

హొళగుంద: మండలంలో శనివారం వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ ఓబులమ్మ శుక్రవారం తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్టు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పుచ్చకాయలమాడ గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న బోయబాలరాజును శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు. నిందితుడి నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నాట్లు చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

నందవరం: ఆంధ్ర, తెలంగాణ సరిహద్దులో నిర్మించిన నాగలదిన్నె బ్రిడ్జిపై చెక్‌పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిమ్మయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మాట్లాడుతూ.. చెక్‌పోస్టులో వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా ముగతి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ గౌడ్ స్కూటీలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడినట్లు చెప్పారు. నిందితుడి నుంచి కర్ణాటక మద్యం 192 జాన్స్ ఒరిజనల్ ఛాయస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు (90 ఎంఎల్)ను స్వాధీనం చేసుకున్నామన్నారు. స్కూటీని సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

అత్యాచార నిందితుడి అరెస్టు

పత్తికొండ రూరల్/దేవనకొండ: దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామంలో ఏడేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు కేదారిగాళ్ల మునిరంగడును శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. స్థానిక కార్యాలయంలో డీఎస్పీ మాట్లాడుతూ కోటకొండ గ్రామంలో ఈనెల 12న చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన కేసులో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టగా దేవనకొండ బస్టాండు వద్ద ఎస్ఐ భూపాలుడు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. కేసు పూర్తి ఆధారాలను సేకరించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేస్తామని డీఎస్పీ పేర్కొన్నారు.

ప్రారంభమైన కులగణన



నందవరం సచివాలయం–2లో కులగణన సర్వే వివరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్



వెల్దుర్తిలో కులగణన సర్వే చేస్తున్న సిబ్బంది

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథ రామయ్య సూచించారు. శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయం–2, మాచాపురం, ఇబ్రహీంపురం, నదికైరవాడి గ్రామాలలో వలంటీర్ల చేపట్టిన సర్వే వివరాలను మొబైల్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో దాదాపు 20,155 కుటుంబాలు ఉన్నాయని, పకడ్బందీగా సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ నెల 28వ తేదీ వరకు సర్వే నిర్వహిస్తునట్లు, 100 శాతం పూర్తి చేయాలని వలంటీర్లకు వివరించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆర్ఐ జెర్మియా, ఏరియా గణాంకాల అధికారి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: మండలంలోని ఆస్పరి, జొహరాపురం, శంకరబండ, చిన్నహోతూరు, చిరుమాన్‌దొడ్డి, హలిగేర, చిగిళి, తంగరడోణ, నగరూరు, బిణిగేరి, బిల్లేకల్లు, ముత్తుకూరు, పుటకలమర్రి, కైరుప్పల, కారుమంచి, ములుగుందం, బనవనూరు, డీకోటకొండ గ్రామాలలో శుక్రవారం కుల గణన సర్వే చేపట్టినట్లు ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. సచివాలయం సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కుంటుంబ సభ్యులు, వారి ఆర్థిక వివరాలు సేకరించనున్నట్లు చెప్పారు.

తుగ్గలి: మండలవ్యాప్తంగా శుక్రవారం కులగణన సర్వే ప్రారంభమైంది. వలంటీర్ల సాయంతో సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలను నమోదు చేసే పనిలో నిమగ్నమయ్యారు. సర్వేను ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ గోపాల్, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్ పర్యవేక్షించారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలవ్యాప్తంగా శుక్రవారం కులగణన సర్వే ప్రారంభమైంది. 18 సచివాలయాల పరిధిలోని వలంటీర్లు తమకు కేటాయించిన ఇళ్ల వద్దకు సచివాలయ ఉద్యోగులతో కలిసి వెళ్లి సర్వే ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి కుటుంబ పెద్ద అథెంటికేషన్‌తో పలు వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. రామళ్లకోటలో జరిగిన సర్వేను ఎంపీడీఓ శ్రీనివాసరావ్ పరిశీలించారు.

మద్దికెర: మండలంలోని ఆయా గ్రామాలలో పక్కాగా కులగణన సర్వే చేస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి శుక్రవారం తెలిపారు. పెరవలి గ్రామంలో కులగణన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ప్రసాద్, వలంటీర్లు శేఖర్ పాల్గొన్నారు.

చిప్పగిరి: కులగణన ప్రక్రియలో భాగంగా అధికారులు శుక్రవారం చిప్పగిరిలో ఇంటింటికీ వెళ్లి కుటుంబసభ్యుల వివరాలు నమోదు చేసుకుంటున్నారు. అలాగే కుటుంబ పెద్ద వేలిముద్రలతో ఈ–కేవైసీ పూర్తి చేశారు. ఎంపీడీఓ కొండయ్య, ఈఓపీఆర్డీ బాలన్న కులగణనను పర్యవేక్షించారు.

హొళగుంద: ఆయా గ్రామాలలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కులగణన సర్వే చురుగ్గా చేపట్టారు. హొళగుందలో పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ ఆధ్వర్యంలో పలు కాలనీలలో సర్వే నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కుటుంబ వివరాలు సేకరించి ప్రత్యేక యాప్‌లో యజమాని, వలంటీర్ వేలిముద్రలను అప్‌లోడ్ చేశారు.

చెక్‌పోస్ట్ వద్ద సీఐ తనిఖీలు

నందవరం: వాహనాలలో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ మోహన్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని నాగలదిన్నె బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో ఎస్ఐ తిమ్మయ్య నేతృత్వంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్ర, తెలంగాణ సరిహద్దులో ఏర్పాటు చేసిన నాగలదిన్నె వంతెన వద్ద ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే జైలుకు పంపుతామన్నారు. అక్రమ మద్యం, ఇసుక, నగదు రవాణాను అరికట్టే నేపథ్యంలో తనిఖీలు నిర్వహించామన్నారు. వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అలాగే చెక్‌పోస్టు వద్ద పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.